నాటకం

(పాత్రలు : పర్వతాలరావు, పానకాలరావు, చిరంజీవి, దాశరథి, లక్ష్మి)

## [మొదటి రంగం]

[ఒక పెద్ద గది. మధ్య బల్ల దాని చుట్టూ కొన్ని కుర్చీలు. ఒకమూలగా గోడకి ఆనుకుని నాటకాలకి ఉపయోగపడే 'బాక్‌గ్రవుండ్ దృశ్యాలు మరోకోవైపున చిందర వందరగా పడిఉన్న ఇతరవస్తువులు—ఎక్కువగా నాటకాలకి ఉపయోగపడేవి. వంకరగా మంచానికి పెట్టివున్న ఒక బోర్డుమీద "ఆంధ్ర నాటకరంగం—రిజిస్టర్‌డ్ ఎసోసియేషన్" అని కనిపిస్తాయి. ఆ గది పై ఎసోసియేషన్ కార్యాలయానికి సంబంధించినదని తెలుపుతాయి. తెరపైకి లేచేసరికి ఒకకుర్చీలో పర్వతాలరావు కూర్చుని నిద్ర పోతూ ఉంటాడు. కొన్ని క్షణాల తర్వాత ఎదురు గోడలు స్టేజికి ఇంచుమించు మధ్యగా కనిపించే తలుపు తెరుచుకుని పానకాలరావు హడావుడిగా లోపలికి వస్తాడు. నిద్రపోతున్న పర్వతాలరావుని తట్టి లేపుతాడు.]

పానకాలరావు:—ఇంకా నిద్రేమిటి లేరా!

పర్వతాలరావు:—(కళ్ళు తెరచి నిద్రమత్తుతోనే) ఏమయిందేంట్రా?

పా. రా:—ఏమయిందేమిటి కొంప మునిగింది!

ప. రా:—కొంపా? ఎక్కడ మునిగింది? ఎవరి కొంప? ఎందులో?

పా. రా:—నీ మొహం ఎవరికొంపా ఏవిటి? అందర్నీ, అందులో మన్నీ, మరీ లోతుగా!

ప. రా:—అయితే వరద బాధితుల నిధికి ఎప్లికేషన్ పెట్టాలా?

పా. రా:—వరద బాధితులేవిట్రా చచ్చుమొహమూ నువ్వూ! అసలేం జరిగిందో అడగవేం?

ప. రా:—అడగమంటావ? సరే, అడిగాననుకో. కొంపేమిటి? మునగడమేమిటి? ఎక్కడ? ఏం—

పా. రా:—(అతని మాటకి అడ్డం వస్తూ) ప్రశ్నవేసి చంపక. అసలేం జరిగిందంటే, అందరూ గొప్పవాళ్ళయిపోతున్నార్రా! అదీ నా బాధ.

ప. రా:—(అనుమానంగా) ఏం, అవగూడదని ఎవరయినా అన్నారా?

పా. రా:—ఎవరో అన్నమేమిటి? నేన అంటూ ఉంటే......అంత గొప్పవాళ్ళయిపోతూ ఉంటే మనం మాత్రమిలా ఉన్నాం. చూడు ఆనందరావెంతవాడయి పోయాడో. 'అఖిలాంధ్ర నాటక పోటీ'లో మన ఎసోసియేషన్ అతని నాటకాన్నే ఆడిస్తోందిట. ఇక సన్మానాలూ, సభలూ, పత్రికల్లో ఫొటోలూ—మనమో? ఎప్పుడు డ్రామాల్లో పోర్షనిస్తారా అని కాచుక్కూచ్చున్నాం. అడ్డమయిన వాళ్ళ చుట్టూ తిరుగుతున్నాం—

ప. రా:—అర్థమయిందిరా మన బాధ. కాస్త ఏదం




ఆనందంగార్నే పోర్షనిమ్మని అడుగుదామా? ఇస్తాడంటావా?

పా. రా:—పోర్షనా? నీకూ, నాకూనా? చస్తే ఇవ్వడు. ఇచ్చినా, ఇవ్వపోయినా నా బాధేమిటంటే వాడిలా గొప్పవాడయిపోతున్నాడే అని ....ఆ! నాకోటని పిస్తోంది. శ్యామ్రావు లేడూ? అతన్నడిగి మరో నాటకం రాయిద్దాం. దాన్నే ఎసోసియేషన్ ఎంట్రీకింద పంపమని ప్రెసిడెంటుతో చెబ్దాం. ఏమంటావ్?

ప. రా:—అమ్మ బాబోయ్, శ్యామ్రావే! అతన్ని చూస్తేనే నాకు హడలు. ఒకసారి రిహార్సల్లో నన్ను బయటికి తరిమి మళ్ళీ తన డ్రామాలల్లో పోర్షన్లడగొద్దన్నాడ్రా... .

పా రా—అదీ నిజమే. నేనూ అతని నాటకాలు బాలేవని ప్రచారం చేసినవాణ్నే. అదికాదు, అసలు పోయినేడే అతని నాటకాన్ని పోటీకి పంపించారు. మళ్ళీ ఈ ఏడాది పంపమంటే బావుంటుందా?

ప. రా—వోరే, కార్యసిద్ధికి తాయత్తులమ్మబడును అని ఏదో ప్రకటన చూశారా. అవేమయినా కట్టుకుని తిరిగితే—

(ఇంతలో స్టేజికి కుడివైపు తలుపు ఒకటి తెరుచుకుని దాశరథి లోపలికి వస్తాడు. వస్తూనే—)

దాశరథి—మీకేం భయమక్కర్లేదు. నే చూపిస్తా దాని.

ప. రా—(ఆశగా అతనివైపు తిరిగి) మంచితాయిత్తులెక్కడ్దొరుకుతాయో మీకు తెలుసా? జలంధర్, లూధియానా.....

పా. రా—వోరేయ్‌పర్వతాలూ, నీ గోలాపు. దాశరథిగారూ! మంచి సమయానికే వచ్చారు! మాకు మీరే మార్గం చూపించాలి. అదేదో చూర్ణం ఉందిట, నాలికమీద వేసుకుంటే కవిత్వం బాగా వస్తుందిటగా. అదేదయినా ఇప్పించండి, మే మే నాటకాలు రాసిచూస్తాం!

దా.—(ఒక చెయ్యి పైకెత్తి) కంగారు పడకండి. ఆనందరావు నాటకం పోకూడ్కదనేగా మీ తాపత్రయం? దానికి నే నో మంచి ఉపాయం ఆలోచించాను. శ్యామ్రావుగారిని పడ్దాం.

ఆయన—

ప. రా:—(ఆయన మాటకి అడ్డు వస్తూ) ఆయనేం లాభం? పోయినేడు ఆయన్నాటకం పోటీకి పంపాం. మళ్ళీ వేయనిస్తారా?

దా—దానికో దారుంది. నాతో రండి చెప్తా.

ప. రా, పా. రా:— (ఇద్దరూ కలిసి) శ్యామ్రావు దగ్గిరకయితే మేం రాం! కసురుకుంటాడు!!

దా:—ఆయన దగ్గిరికక్కర్లేదు లెండయ్యా, రండి...

(అంతా నిష్క్రమిస్తారు.)

## [రెండవ రంగం]

తెర పైకి లేస్తుంది.

(మొదటిరంగంలో కనిపించిన గదిలోనే బల్ల చుట్టూ మూడు కుర్చీలలో పర్వతాలరావూ, పానకాలరావూ, చిరంజీవి కూర్చుని ఉంటారు. దాశరథి సిగరెట్టు పీలుస్తూ, ఇటూ అటూ నడుస్తూ మాట్లాడుతూ ఉంటాడు.)

దా:—మీరేం సందేహించకండి. అంతా నా కొదిలెయ్యండి. మీరు మాత్రం శ్యామ్రావుతో మాట్లాడాలంతే.

చిరంజీవి:—అతనొప్పుకుంటాడా అని; అసలే కథ రాసేవాళ్ళనిచూస్తే అతని కిష్టంలేదు. నా కథ లేవీ బాలేవని నీళ్ళతో వాళ్ళతో అన్నాట్టకూడా.

ప. రా:—నేనే చెప్తాకదండీ మీతో. నోసారి, రిహార్సల్లో నానటన బాలేదని కోప్పడ్డాడు. నా పోర్షన్ ఇంకోళ్ళకిచ్చేస్తా నన్నాడు. అప్పుడు మీరు నా నటన బాగుందన్నారని కూడా చెప్పపోయాను. "వాడికేంతెలుసు, చవకబారు కథ రాసేవాడు!" అని కోప్పడ్డాడండీ! (దిక్కమొహంతో) చేతిలో, కర్ర పెట్టి కొడ్తాడనుకున్నానండీ....

పా. రా:—నిన్ను చస్తే కొట్టడ్రా. నే చెబుతున్నాగా

ప. రా:—(సంతోషంగా) నిజంగానా? నీ కెలా తెలుసూ?

దా—కర్ర విరుగుతుందని భయంలేకాని, అసలు సంగతి మర్చిపోతున్నారు. చిరంజీవిగారి కథ నొకదానిని నాటకంగా మార్పించాలి. ఆపని శ్యామ్రావుగారికి పెడదాం. అతను రాశాడంటే ప్రయిజు మనదే. అయ్యా! పర్వతాలరావుగారూ, పానకాలరావుగారూ! మీ సాయం కావాలి.

ప. రా:—మీరేంచెయ్యమన్నా చేస్తాం. నాటకంలో పోర్షన్లిప్పించడంతే. ఏరా పానకాలూ అంతేనా.

పా. రా:—ఎప్పుడూ అంతేరా!

చి:—శ్యామ్రావు నాట—అదే మా నాటకంలో మీ రిద్దరూ వేస్తారా? అత నొప్పుకుంటాడా? అయినా ఏ పోర్షన్లిస్తాడు?

దా:—అవన్నీ తర్వాత చూసుకుందాంలెండి! ముందు నే చెప్పేది వినండి. మన ప్రెసిడెంటుగారు, శ్రీమతి లక్ష్మి గారున్నారు చూశారూ ఆవిడకి

నచ్చచెప్పి మన నాటకమే పోటీకి వెంట్రటీగా పంపించేట్లు చెయ్యాలి.

వి—అంత తేలిక పనికాదనిపిస్తోంది.

దా—అందుకే పర్వతాలరావుగారినీ, పానకాలరావుగారినీ వెళ్ళి ఆవిడని కలుసుకుని ఎసోసియేషన్లో ఆనందరావుగారి నాటక మేదీ బావుళ్ళేదని అందరూ అనుకుంటున్నారని చెప్పారు.

ప. రా—కావలిస్తే మహజరు తీసుకు పోతామండీ—

వి—మన్మథరావుగారితో నో మాట చెప్తే బావుంటుందేమో?

దా—తప్పకుండా. ఏమండీ. మీ రిద్దరూ ఆ పని కూడా చూసుకుంటారా?

ప. రా—వో!

వి—అలాగే శ్యామ్రావుగారినీ కల్సుకోండి—

ప. రా—బాబోయ్ నే కలవను. ఆపనేదో మీరే చూసుకోండి.

దా—అదంతా తర్వాతగాని, మీ రిద్దరూ రాజ్ నగర్లో లక్ష్మీగారింటికి వెళ్ళిరండి.....

[తెర]

[మూడవ రంగం]

(శ్రీమతి లక్ష్మి ఇంట్లో గది. ఒక వైపు పుస్తకాల బీరువా, మరొకవైపు సోఫా, కుర్చీలూ, వ్రాత బల్ల వగయిరాలు. అది ఆఫీసుగది, అని తెలుస్తుంటాయి. తెర పైకి లేచేసరికి పర్వతాలరావూ, పానకాలరావూ కూర్చుని ఉంటారు.)

పా. రా—మన్మథరావు గారెలాగూ లాత్పూర్ వెళ్ళి పోయారుకదరా. ఇక మనం చూసి నచ్చచెప్పేది ప్రెసిడెంటుగారు మాత్రమే. మనం తల్చుకుంటే అవకేం చేస్తుందిలే. అదీకాక మెంబర్లంతా మనవంపేగా—

ప. రా—ఏ మెంబర్లు? ఒక దాశరధిగారేగా?


పా. రా—వోరేయ్, కాసేపు నోరు మూసుకూర్చుంటావూ? మన మిప్పుడు మెజార్టీ ప్రతినిధులం, నాయకులం—అర్థమయిందా?

ప. రా—మెజార్టీ ఉందన్నీకెలా తెల్సురా?

పా. రా—శ్యామ్రావుగారూ, దాశరధిలాంటి వాళ్ళు కలిస్తే మెజార్టీ ఉండకేం చేస్తుందీ. అయినా ఇంత ముఖ్యమయిన పని మనకి నచ్చచెప్పారంటే అర్థ మేమిటి?

ప. రా—మన ప్రెసిడెంట్ శ్రీమతి లక్ష్మిగారు తిడ్తే పడ్డామనేమో.....

పా. రా—అపశకునప్పక్షివంటే నువ్వే! ప్రెసిడెంట్తో నే మాటాడినంతసేపూ నోరు తెరవక, అర్థమయిందా? (రహస్యంగా, ముందుకి వంగి) ఎసోసియేషన్లో ఆనందరావుగారి నాటకం ఎవరికీ



నచ్చలేదనీ, ఎవరికీ పోర్షన్లు సరిగ్గా ఇవ్వలేదనీ గొడవ గొడవగా ఉందని చెబ్దాం. చిరంజీవిగారి నాటకం—

(శ్రీమతి లక్ష్మి లోపలికి వస్తూ—)

లక్ష్మి—(చిరునవ్వుతో) —ఏమిటండీ పానకాల్రావుగారూ రహస్యాలు చెప్తున్నారు?

పా. రా—(కంగారుగా లేచి నుంచుంటూ) నమస్కారమండీ


ప. రా—(లేచి నుంచుంటూ) నమ—(మళ్ళీ ఏదో గుర్తుకి వచ్చినట్లు మాటని మధ్యలో ఆపివేసి, భయంగా పానకాలరావువంక ఒకసారి చూసి, చేతుల్తో నమస్కారంచేసి వూరుకుంటాడు.)

ల—నమస్కారం కూర్చోండి. ఏమిటిలావచ్చారు? (అంతా కూర్చుంటారు.)

పా. రా—మరేం లేదండీ, ఈమధ్య ఎసోసియేషన్లో అల్లర్లెక్కువౌతున్నాయిలెండి, వాట్నిగురించి మీకు చెబ్దామని—

ల—అల్లర్లా? ఏమిటని?

పా. రా—అదేనండీ, ఈమధ్య పోర్షన్ల గురించి పెద్ద బాధగా ఉంది ఆనందరావుగారి నాటకంలో వేసేవారంతా తమ కిచ్చిన పోర్షన్లు సరిగ్గా ఇవ్వలేదంటున్నారండీ. కొందరేమో తమ కసలు పోర్షన్లివ్వకుండా బయిటే ఉంచేశారని గోల పెడుతున్నారండీ అందుకనే, అంతా కలిసి ఈ



నాటకం బదులు మరోదాన్ని పోటీకి పంపించాలనుకుంటున్నామండీ.....

ల—ఇప్పుడా? నాటకాన్ని మార్చటమా? అదెలా?

పా. రా—మీరు తల్చుకుంటే వీలుకాని దేముంటుంది లెండి. చిరంజీవిగారు నాటకం రాశారని తెలిసింది. ఆయన్నే అడిగాను. రాసినట్లు ఒప్పుకున్నాడు. దాన్ని మీరు చూస్తే బావుంటుంది.

ల—చిరంజీవిగారు నాటకాలు రాస్తారా? ఆయన కథా రచయితకదూ?

పా. రా—ఈమధ్య ఆయనకి నాటకాలమీదకి మనస్సు పోయిందిలెండి. ఆయన నాటకం చూస్తే మీకు బాగా నచ్చి తీరుతుంది.

ల—(కొంచెం ఆలోచించి) ఏమండీ పర్వతాలరావుగారూ మీ అభిప్రాయంఏమిటి?

ప. రా—(నిస్సహాయంగా పానకాలరావువంక చూస్తాడు.)

పా. రా—చెప్పవయ్యా, సందేహిస్తావెందుకూ?

ప. రా—నేనూ, పానకాలరావూ, దాశరధిగారూ—మా అందరి అభిప్రాయమూ ఒకటేనండీ. ఆనందరావు నాటకంకన్నా శ్యామ్రావు నాటకమే బావుంటుంది.

ల—శ్యామ్రావు నాటక మేమిటి?

పా. రా—అదేలెండి. పర్వతాలరావుకి కొంచెం మతిమరుపు. చిరంజీవి, అనబోయి శ్యామ్రావు అన్నాడు.

ప. రా—అవునవును అంతేనండి. ఏదో పొరపాటు.

(శ్రీమతి లక్ష్మి వెంటనే జవాబు చెప్పదు. కొంత సేపు నిశ్శబ్దం. చివరికి ఆమె లేచి, ఒక బల్ల సొరుగు తెరిచి, ఒక కాగితం బయటికితీస్తుంది. మళ్ళీ తన కుర్చీలో కూర్చుని దాన్ని చదివి—)

ల—పానకాల్రావుగారూ, మీ ఉద్దేశమేమిటో నాకు బాగా అర్థమయింది. పోర్షన్లివ్వలేదని మీ బాధ! దానికి నే నో మార్గం చూపిస్తాను. కొంతకాలం క్రితమే శ్యామ్రావు గారో మంచి ప్రహసనం రాశారు. దాంట్లో ఇద్దరు విదూషకులకి మంచి నటులు దొరకలేదు. వాటికి మీ పేర్లిస్తే బావుంటుందనుకుంటున్నాను. బాగా పని చేస్తారని ధైర్యంగా ఉంది.

(ఇంతలో లోపల ఎక్కడో 'అమ్మగారూ!' అని పిలుస్తారు.)

ల—క్షమించండి. ఎవరో పిలుస్తున్నారు. మాటొస్తా

(నిష్క్రమిస్తుంది.)

పా. రా—ఛా, మన పని ఎప్పుడూ ఇంతేరా

ప. రా—ఇప్పుడూ ఇంతేరా!!

(తెర)